అవనిగడ్డ ఆగస్టు 30 : వృక్షాలు పెంచి పోషిస్తున్న వృక్ష ప్రేమికుడు అద్దేపల్లి వెంకటేశ్వరరావు కేవలం దేవాలయాలలో మాత్రమే ఉండే పారిజాతం మారేడు లేత ఉసిరి సంపెంగ నాగలింగ వంటి 28 వృక్ష జాతులను ఐదో వార్డుకు చెందిన అద్దేపల్లి వెంకటేశ్వరరావు సిద్ధం చేశారు ఈ మొక్కలను నాటటంతో ఆంధ్ర తెలంగాణ దేవాలయాలలో 1000 మొక్కలు పూర్తవుతాయని అద్దేపల్లి వెంకటేశ్వరరావు ఆదివారం తెలియజేశారు మరికొన్ని మొక్కలు దేవాలయాలలో ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నానని అవసరమైన వారు సంప్రదించాలని కేవలం దేవాలయ ఆవరణలో మాత్రమే ఈ మొక్కలు నాటాలని ఆయన చెప్పారు 2012 వ సంవత్సరం నుంచి రెండు తెలుగు రాష్ట్రాలలోని దేవాలయలలో మొక్కలు నాటడం జరుగుతుందని 77 సంవత్సరాల వయసులో కూడా కడియం నర్సరీ నుండి మొక్కలు తీసుకొస్తున్నట్లుగా చెప్పారు. ఊపిరి ఉన్నంతవరకు ఇదేవిధంగా కొనసాగిస్తానని ఆయన అన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

అవనిగడ్డ ఆగస్టు 30 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జరుగుతున్న ఏర్పాట్లను అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు శనివారం రాత్రి పరిశీలించారు. రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, అనం రామనారాయణరెడ్డిలతో కలిసి ఆయన కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో వివరాలు తెలుసుకున్నారు.ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, సభా ప్రాంగణం, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు.వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని సాగు, తాగునీటి అవసరాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, ఈ ప్రాజెక్టును పూర్తి చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపిన ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని విక్కుర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

మొక్కలు పెట్టి వృక్షాలను చేద్దాం

అవనిగడ్డ ఆగస్టు 30 : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం మొక్కలు నాటుదాం అనే కార్యక్రమం లో భాగంగా ఆదివారం ఉదయం లంకమ్మ మాన్యం రహదారిలో మొక్కలు నాటారు ఈ మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ ఏ హరి ప్రసాద్ డెంటల్ డాక్టర్ చేబ్రోలు హరిబాబు ఎస్ వి ఎల్ క్రాంతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు కాలుష్య రహిత అంధ్ర ప్రదేశ్ ని తద్వారా హరిత భారతిని తయారు చేయవలసిన అవసరం మన పైన ఉందని అన్నారు వేసవికాలం లో ఏర్పడే అత్యధిక వేడిని తగ్గించాలంటే రహదారుల వెంట మొక్కలు వాటిని వృక్షాలుగా తయారు చేసి ఎండ పడకుండా ఉండే విధంగా రోడ్లను తయారు చేయాలి అని అన్నారు. డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ సొసైటీ వారు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మొక్కలు నాటుదాం అనే కార్యక్రమం ప్రజల అభిమానం చూడగుందని మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించే బాధ్యత కూడా వారే తీసుకోవడం అభినందనీయం అన్నారు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ హరిత అవనిగడ్డను తయారు చేయడంలో విద్యార్థులు తమ వంతు కృషిని చేయాలని అవకాశం దొరికినప్పుడల్లా విద్యార్థులకు ఈ విషయాన్ని తెలియజేస్తున్నాం అని అన్నారు ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గరికి పాటి హరిప్రసాద్ కోశాధికారి అల్లంశెట్టి వెంకటేశ్వరరావు పర్చూరు రాఘవేంద్ర రావు కొండవీటి కిషోర్ బాబు ఎన్ ఆర్ ఎస్ కె ప్రసాద్, సామర్ల మల్లికార్జున రావు, కోడూరు శ్రీనివాసరావు, ఉగాది సుబ్రహ్మణ్యేశ్వర రావు, కొమ్మినేని ఉమామహేశ్వరరావు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

కోలాహలంగా భక్తులు సద్ది నైవేద్యాలు సమర్పణ



అవనిగడ్డ ఆగస్టు 30 : దివిసీమ కు కొంగుబంగారమై కోరిన కోరికలు తీర్చే కలపవల్లిగా వీరాజిల్లుతున్న గ్రామదేవత లంకమ్మ అమ్మవారికి సద్ది నైవేద్యాలు భక్తులు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. శ్రావణ మూడవ ఆదివారాన్ని పురస్కరించుకొని ఆలయ చైర్మన్ అన్నపురెడ్డి వెంకటస్వామి కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావుల పిలుపుమేరకు వర్షాలు సకాలంలో సమృద్ధిగా పడి పంటలు పండి దివిసీమ ప్రజలు పాడిపంటలతో సుఖ సంతోషాలతో సౌభాగ్యాలతో సిరిసంపదలతో తులతూగాలని లోక కళ్యాణార్థం అమ్మవారికి సద్ది నైవేద్యాలు ముందుగా పోతరాజు వంశస్థులు డప్పు కోలాటాలు మేలు తాళాలతో సమర్పించారు. గ్రామ నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి సద్ది నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు కావలసిన ఏర్పాట్లను ఆలయ చైర్మన్ అన్నపురెడ్డి వెంకటస్వామి కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు పాలకవర్గం ఆలయ సిబ్బంది స్వయంగా పర్యవేక్షించగా మహిళా భక్తులు సాయంత్రం అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహికంగా లలిత సహస్రనామ పారాయణం చేశారు. భజన భక్త బృందం వారు అమ్మవారి పాటలను ఆలపించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను సేకరించారు,

కోలాహలంగా మొక్కుబడులు సమర్పణ

అవనిగడ్డ ఆగస్టు 30 : దివి సీమకు కొంగు బంగారుమై కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న గ్రామదేవత లంకమ్మ అమ్మవారికి భక్తులు ఘటంబింది మొక్కుబడులు చెల్లించుకున్నారు ఈనెల 30, 31 తేదీలలో వివాహ ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో దివిసీమలో వివాహానికి ముందు గ్రామ దేవత లంకమ్మ అమ్మవారికి ఘటంబింది మొక్కుబడులు చెల్లించుకోవడం గత కొంతకాలంగా ఆనవాయితీగా వస్తుంది అందులో భాగంగా ఆదివారం తలపై ఘటం బిందె మెడలో గారెల దండ రంగులు చల్లుకుంటూ తీన్మార్ డప్పుల కోలాటాలకు అనుగుణంగా ఊరేగింపుగా నృత్యాలు చేసుకుంటూ కేరింతలు కొడుతూ కనుమరుగవుతున్న కర్ర సామును చేసుకుంటూ అమ్మవారి ఆలయానికి భారీగా మొక్కుబడులు చెల్లించుకునే భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ చైర్మన్ అన్నపురెడ్డి వెంకటస్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) పాలకవర్గ సభ్యులు ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గ్రామ చిత్రపటంతో రైతులకు అవగాహన

ఘంటసాల, : గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలో నివాసం ఉంటూ రైతులు వ్యవసాయ రంగంలో చేపడుతున్న సాగు పద్ధతులపై అవగాహన కల్పించుకుంటూ వ్యవసాయంలో వస్తున్న సాంకేతిక మార్పులు, లాభసాటి వ్యవసాయం తదుపరి అంశాలను వివరించారు. పంట పొలాలకు వెళ్లి రైతులతో మాట్లాడి వ్యవసాయంపై తమకు తెలియని విషయాలను తెలుసుకోవటంతోపాటు తెలిసిన విషయాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. శ్రీకాకులంధ్ర మహావిష్ణు ఆలయ పరిసరాలలో శ్రీకాకుళం గ్రామంలో రంగవల్లులతో స్వరూపాన్ని, గ్రామాలలో ఎక్కువ విస్తీర్ణం లో సాగు చేసే పంటలు, స్థాపించబడిన సంస్థలు, గ్రామము వ్యవసాయ భూముల విస్తరణ, గ్రామ పటం, సీజనల్ క్యాలెండర్, మొబిలిటీ మ్యాప్, టైమ్ ట్రెండ్ ఇలా గ్రామం వివిధ అంశాలను రంగవల్లులతో అందంగా చిత్రీకరించి రైతులకు వివరించారు. విద్యార్థినులకు అభినందనలు తెలియచేస్తూ గ్రామంలో రైతులు చేపట్టే సేద్య పద్ధతులను నేరుగా తెలుసుకోవాలని, పరిశోధనలో వెలువడినటువంటి సాంకేతిక సమాచారాన్ని రైతులకు అందచేయాలని కె వి కే సమన్వయకర్త డా.డి. సుధారాణి సూచించారు. కెవికె శాస్త్రవేత్త డా.యం.వెంకటలక్ష్మి శ్రీకాకుళం గ్రామంలో అభ్యుదయ రైతులు బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలబాలికల జిల్లా స్థాయి సాఫ్టాల్ సెలక్షన్స్

ఘంటసాల, : ఉమ్మడి కృష్ణాజిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అండర్ 15 ఇయర్స్ బాలబాలికల జిల్లా స్థాయి సెలక్షన్స్ అవనిగడ్డ క్రీడా మైదానం నందు 31 న జరిగినవి. జిల్లా స్థాయి సెలక్షన్స్ లో ఎన్ జి రంగా జిల్లా పరిషత్ హై స్కూల్ గోగినేని పాలెం విద్యార్థులు ఎంపికైనారు. బాలుర విభాగంలో అబ్బూరి హేమంత్ పండు బాబు స్టాండ్ బై బాలికల విభాగంలో పెనుమత్స యామిని కుమారి జిల్లా జట్టుకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని లంకే కృష్ణకుమారి అభినందన సభలో తెలియజేసినారు జిల్లా జట్టుకి ఎంపికైన హేమంత్, పండు బాబు, యామిని కుమారి లను వీరికి శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ అప్పికట్ల రామారావును ప్రధానోపాధ్యాయిని లంకే కృష్ణకుమారి పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కుంపటి జీవన్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయ కార్యదర్శి మురాల పిచేశ్వరరావు అభినందించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ అప్పికట్ల రామారావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలు సెప్టెంబర్ 11 నుండి 13 వరకు విజయనగరం జిల్లా బొబ్బిలి నందు జరుగుతాయని తెలియజేశారు.

రెండ్రోజుల పాటు పులివెందులలో జగన్ పర్యటన

సెప్టెంబర్ 1, 2 తేదీల్లో వైఎస్ జగన్ పులివెందుల పర్యటన

వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న జగన్

ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద తండ్రికి నివాళులు

పర్యటనలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండనున్న మాజీ సీఎం

అమరావతి: వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గమైన పులివెందులలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఈ పర్యటన జరగనుంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో జగన్ పాల్గొననున్నారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జగన్ పులివెందుల చేరుకుంటారు. అనంతరం భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఆ రోజు రాత్రికి పులివెందులలోని తన నివాసంలోనే బస చేస్తారు. ఇక సెప్టెంబర్ 2వ తేదీన ఉదయం పులివెందుల నివాసం నుంచి బయలుదేరి 7:45 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తారు. వర్ధంతి కార్యక్రమం పూర్తయిన అనంతరం జగన్ అక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రతీ ఏటా వైఎస్సార్ వర్ధంతి, జయంతి కార్యక్రమాలకు జగన్ హాజరై నివాళులు అర్పించడం తెలిసిందే.

వెలిగొండపై మాటల యుద్ధం.. జగన్ కు లోకేశ్ కౌంటర్

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం... టీడీపీ, వైసీపీ విమర్శల పర్వం

నీళ్లు లేకుండానే జగన్ ప్రాజెక్టును ప్రారంభించారంటూ లోకేశ్ ఎద్దేవా

తొలి దశ పూర్తి చేసి నల్లమల సాగర్‌లోకి నీటిని విడుదల చేసిన చంద్రబాబు

తన తండ్రి, తన ఘనతేనంటూ ముందురోజు పోస్ట్ పెట్టిన జగన్

అమరావతి: ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని పలు వెనుకబడిన ప్రాంతాల దశాబ్దాల కలను సాకారం చేసే వెలిగొండ ప్రాజెక్టు, ఇప్పుడు తెలుగుదేశం, వైసీపీల మధ్య తీవ్ర రాజకీయ వివాదానికి కేంద్రంగా మారింది. మంత్రి నారా లోకేశ్.. వైసీపీ అధినేత జగన్ ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడం తెలిసిందే. నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో, "ఆ విజువల్స్‌ను దగ్గరగా చూడండి" అంటూ కొన్ని ఫోటోలను పోస్ట్ చేశారు. "2024లో వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారు. నీళ్లు లేని ఒక నీటిపారుదల ప్రాజెక్టును ప్రారంభించారు. ఇలాంటి ఫేక్ ప్రారంభోత్సవం వైసీపీకే సాధ్యం!" అని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం 2024 మార్చిలో సొరంగాలు పూర్తి చేసిన సందర్భంగా నీటి ప్రవాహం లేకుండానే ప్రారంభోత్సవం జరిపిందని, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం నిజంగా నీటిని విడుదల చేసిందని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. కాగా, జగన్ నిన్న ఒక సుదీర్ఘ పోస్ట్‌లో వెలిగొండ ప్రాజెక్టు ఘనత తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డిది, తన ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కీలకమైన సొరంగాల పనులను తమ ప్రభుత్వమే పూర్తి చేసిందని, టీడీపీ హయాంలో పనులు నెమ్మదిగా సాగాయని విమర్శించారు. ఈ పోస్టుకు కౌంటర్‌గానే లోకేశ్ తాజా విమర్శలు చేశారు. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి, నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. తొలి విడతగా 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయడంతో, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు చెందిన సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది.

వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు

మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం

నాడు పునాది వేసిన తానే నేడు ప్రారంభించడం అదృష్టమన్న సీఎం చంద్రబాబు

గత ప్రభుత్వం ఫేక్ ప్రారంభోత్సవంతో ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శ

2028 నాటికి రెండో దశ పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లా ఇస్తామని హామీ

నదుల అనుసంధానంతోనే దేశంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమన్న ముఖ్యమంత్రి



అమరావతి: ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తన రాజకీయ జీవితంలో ఇదొక మరపురాని రోజని, మాట ఇచ్చి నిలబెట్టుకున్నానన్న సంతృప్తితో గుండె ఆనందంతో నిండిపోయిందని భావోద్వేగంగా అన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు తాను పునాదిరాయి వేసిన క్షణాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా 2026 ఆగస్టు 31న దీనిని ప్రారంభించడం భగవంతుడు తనకు ఇచ్చిన అరుదైన అవకాశంగా అభివర్ణించారు. "పునాది వేశాను, ప్రాజెక్టు పూర్తి చేశాను, కృష్ణమ్మను తెచ్చాను, కరవును తరిమి కొడుతున్నాను. మాట ఇచ్చాను, నిలబెట్టుకున్నాను. ఈ ప్రాంత ప్రజల కళ్లలో ఆనందం చూస్తుంటే మాటలు పెగలడం లేదు. ఇది నా అదృష్టం" అని చంద్రబాబు అన్నారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసిత ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని, వారి త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని కొనియాడారు. వెలిగొండ అంటే కరవుపై గెలుపు, రైతు భవిష్యత్తుకు నమ్మకం, ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు అని ఆయన అభివర్ణించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని, 2024 ఎన్నికలతో ఆ గ్రహణం వీడిందని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ప్రభుత్వం కేవలం 2.77 శాతం పనులు చేసి, విలువైన కాలాన్ని గాలికొదిలేసింది. ఎన్నికలకు నెల ముందు రూ.4,500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని డ్రామా ఆడింది. ఇది సిగ్గులేనితనం కాదా? కరవు ప్రాంత రైతులతో ఆడుకోవడానికి మానవత్వం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు. సొరంగంలో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్‌ను తాను స్వయంగా రంగంలోకి దిగి తొలగించానని చంద్రబాబు వెల్లడించారు. ఆ తర్వాత, ఇంకా పనులు మిగిలి ఉండగానే సొరంగాలు మొత్తం తిరిగివచ్చానని, ప్రాజెక్టు సిద్ధంగా ఉందని చెప్పిన అనాటి ఫేక్ ముఖ్యమంత్రిని ఏమనాలో మార్కాపురం ప్రజలే ఆలోచించాలని అన్నారు. తన హయాంలోనే ప్రాజెక్టుకు 50 శాతానికి పైగా నిధులు ఖర్చు చేశామని, వాస్తవాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఫేక్ మాటలతో ప్రజలను ఎవరూ మోసం చేయలేరని చంద్రబాబు స్పష్టం చేశారు.

వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి

ప్రాజెక్టుతో లబ్ధి పొందే రైతులు ఎంత సంతోషంగా ఉంటారో, త్యాగాలు చేసిన నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి అన్నారు. నిర్వాసితులకు ఇప్పటికే రూ.768 కోట్లు అందించామని, త్వరలోనే మిగిలిన రూ.165 కోట్లు, రూ.169 కోట్లు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కటాఫ్ డేట్ సమస్యతో నష్టపోయిన వారికి అదనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఏ ఒక్క నిర్వాసితుడు ఇబ్బంది పడకుండా ఆదుకోవడం తమ ప్రభుత్వ సిద్ధాంతమని అయన పునరుద్ఘాటించారు. ఎల్ నినో ప్రభావంతో ఎగువన జలాశయాల్లో నీళ్లు లేకపోయినా, కనీసం తాగునీటి అవసరాల కోసం 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తీసుకొస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ నీటితో మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిగా పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం తలరాత మారుతుందని, ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుందని భరోసా ఇచ్చారు.

అది మోదీతోనే సాధ్యం

దేశంలో నీటి సమస్యకు నదుల అనుసంధానమే ఏకైక పరిష్కారమని, అది ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని చంద్రబాబు అన్నారు. 2027 మార్చి నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, వచ్చే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా జరుపుకోబోతున్నామని ప్రకటించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో దక్షిణ భారతదేశంలోని నీటి యుద్ధాలకు ముగింపు పలకవచ్చని, ఆ దిశగా కేంద్రంతో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, ఆ మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మార్కాపురాన్ని రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగం చేశామని, 2028 నాటికి వెలిగొండ రెండో దశను కూడా పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com మహి న్యూస్ epaper: https://epaper.mahinewsindia.com తెలుగు దినపత్రిక

సంపాదకీయం

2 నిమిషాల వినోదం

మైక్రోడ్రామాలకు పెరుగుతున్న వ్యూయర్స్

భారత్‌లో 10 కోట్లకు చేరిన వీక్షకులు

అమెజాన్, జీ గ్రూప్ సైతం ఈ రంగంలోకి..

మైక్రో డ్రామా.. భారత్‌లో ఇటీవలి కాలంలో 'తెర'పైకి వచ్చిన నూతన వినోద సాధనం. మొబైల్ ఫోన్‌లో వీక్షించేందుకు వీలుగా రూపొందుతున్న ఈ 1-2 నిమిషాల చిన్న వీడియోలు ఇప్పుడు మన దేశంలో సంచలనం సృష్టిస్తున్నాయి. కామెడీ, క్రైమ్, రొమాన్స్, రివెంజ్, ఫాంటసీ.. జానర్ ఏదైనా రీల్స్, షార్ట్స్ స్థానాన్ని మైక్రో డ్రామాలు భర్తీ చేస్తున్నాయి. డెస్క్ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్.. వేదిక ఏదైనా ప్రపంచవ్యాప్తంగా యూజర్ల వీక్షణ తీరుతెన్నులు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. మొబైల్ తెరపై గంటల కొద్దీ ఒకే వీడియోను చూడటం పాత కాలం. జెన్ ఆల్ఫా, జెన్-జీ, మిలీనియల్స్, జెన్-ఎక్స్.. తరం ఏదైనా స్క్రీన్‌ను వేగంగా స్క్రోల్ చేస్తున్నారు. అంటే స్క్రీన్‌పై ఉన్న వీడియోను తక్కువ సమయంలోనే స్క్రోల్ చేసి మరో వీడియోను చూస్తున్నారు. ఇటువంటి వారి కోసమే రీల్స్, షార్ట్స్ మాదిరిగా మైక్రోడ్రామా వీడియోలు వెల్లువెత్తుతున్నాయి. చైనాలో మొదలైన మైక్రో డ్రామా ఫీవర్ మన దేశానికీ పాకింది. భారత్‌లో మైక్రో డ్రామా వ్యూయర్స్ సంఖ్య 10 కోట్లు ఉన్నట్టు అంచనా. ఆర్మాక్స్ మీడియా ప్రకారం వీరిలో 55 శాతానికిపైగా వీక్షకులు గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు కావడం గమనార్హం. దిగ్గజ సంస్థలూ ఎంట్రీ..: మెలో డ్రామా, కొరియన్ డ్రామాలు చాలాకాలంగా భారతీయుల వినోదంలో భాగమయ్యాయి. ఇప్పుడు మైక్రో డ్రామాల వంతు వచ్చింది. సిరీస్‌లోని అన్ని ఎపిసోడ్స్‌నూ వీక్షించేంతగా ఈ వీడియోలు ఆకట్టుకుంటున్నాయి. ఇంకేముంది డబ్బులు చెల్లించి మరీ జనం ఆస్వాదిస్తున్నారు. మైక్రోడ్రామాలను ప్రసారం చేసేందుకు మన దేశంలో ప్రత్యేక యాప్స్ కూడా అందుబాటులోకి వచ్చాయంటే వీటికి ఉన్న క్రేజ్ అర్థం చేసుకోవచ్చు. పైగా అమెజాన్, జీ గ్రూప్ వంటి దిగ్గజాలూ ఈ విభాగంలోకి ఎంట్రీ ఇచ్చాయి. మైక్రో డ్రామాల చిత్రీకరణకు తక్కువ వ్యయం అవుతుంది. వీటితో కంటెంట్ క్రియేటర్లకు ఆదాయాలు మెరుగ్గా ఉంటాయి. బాక్సాఫీస్‌ను దాటి..: అతి తక్కువ నిడివితో, సీరియళ్ల రూపంలో వీడియో కథనాలు కోవిడ్%-%19 మహమ్మారి సమయంలో చైనాలో డ్వాంజూగా ఉద్భవించాయి. ప్రస్తుతం ఇవి చైనా బాక్సాఫీస్ కలెక్షన్లను దాటడం ఆశ్చర్యం కలిగించే అంశం. చైనాలో 66 కోట్ల మంది ఈ మైక్రో వీడియోలను వీక్షిస్తున్నట్టు సమాచారం. ఈ విభాగం ఆ దేశ వినోద పరిశ్రమకు ఏటా 7 బిలియన్ డాలర్ల కాసులు కురిపిస్తోంది.

ఇంటర్నెట్ వినోదం.. 31.3 కోట్లు

కేవలం ఇంటర్నెట్ ఆధారిత వినోదం ఆస్వాదిస్తున్న వీక్షకుల సంఖ్య మన దేశంలో 31.3 కోట్లు ఉన్నట్టు అంచనా. వీరిలో నాలుగింట మూడు వంతులు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు కావడం విశేషం. కేబుల్, శాటిలైట్, ఓవర్ ద ఎయిర్ ద్వారా ప్రసారమయ్యే సంప్రదాయ టీవీ వీక్షణానికి వీరు దూరం. గత ఏడాదితో పోలిస్తే డిజిటల్ ఆడియెన్స్ సంఖ్య 30 శాతం పెరిగిందని కాంటార్ తన మీడియా కాంపాస్ నివేదికలో వెల్లడించింది.

అవీ ఇవీ...

' చైనా తరువాత మైక్రో డ్రామా వీక్షకుల సంఖ్యలో అమెరికా, దక్షిణ కొరియా, ఇండోనేసియా, జపాన్ పోటీపడుతున్నాయి. ఆరో స్థానంలో భారత్ నిలిచింది. 2030 నాటికి మైక్రో డ్రామా పరిశ్రమ వార్షిక విలువ భారత్‌లో 5 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. 18-35 ఏళ్ల వయసున్నవారు అత్యధికంగా మైక్రో డ్రామాలను వీక్షిస్తున్నట్లు జీ గ్రూప్ కంపెనీ బులెటిన్ చెబుతోంది. సంప్రదాయ ఓటీటీ షోలతో పోలిస్తే మైక్రోడ్రామాల రూపకల్పనకు సమయం 80% ఆదా అవుతుందన్నది నిపుణుల మాట. భారత్‌లో 70 కోట్ల మంది చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. రోజుకు సగటున 5 నుంచి 7.4 గంటలు మొబైల్‌లో గడుపుతున్నారు. సింహభాగం వాటా వీడియోలదే. ఈక్విటీ పరిశోధన, బ్రోకింగ్ సంస్థ బెర్న్‌స్టీన్ రీసెర్చ్ ప్రకారం.. భారత్‌లో ద్వితీయ శ్రేణి నగరాల్లో కస్టమర్లు నెలకు 35-40 జీబీ ఇంటర్నెట్ డేటాను ఉపయోగిస్తున్నారు. ఇది మెట్రో నగరాల్లోని వినియోగదారుల కంటే 30 శాతం ఎక్కువ. 86% భారతీయులు మైక్రోడ్రామాలతోసహా ఓటీటీలో కంటెంట్ కోసం మొబైల్ డేటా వాడుతున్నారు.

బీమాలో సంపూర్ణ ఎఫ్‌డీఐ

భారత బీమా రంగంలో విదేశీ సంస్థలు పూర్తి స్థాయిలో ప్రవేశించటానికి ఎట్టకేలకు మార్గం సుగమమైంది. ఈ విషయంలో రెండు దశాబ్దాలుగా ఎడతెగకుండా సాగుతున్న ప్రయత్నాలు ఒక కొలిక్కివచ్చాయి. 'సబ్‌కా బీమా సబ్‌కీ రక్షా' పేరిట పార్లమెంటులో రంగప్రవేశం చేయబోతున్న బీమా చట్టాల సవరణ బిల్లు... 1938నాటి బీమా చట్టానికీ, 1956నాటి జీవితబీమా కార్పొరేషన్ చట్టానికీ, 1999 నాటి బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) చట్టానికీ సమూలమైన మార్పుల్ని ప్రతిపాదిస్తోంది. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)ను ప్రస్తుతం వున్న 74 శాతం నుంచి 100 శాతానికి పెంచటానికి ఈ బిల్లు అనుమతిస్తోంది. కేంద్రంలో పాలకులెవరైనా, వారి రాజకీయ విశ్వాసాలూ, నాయకత్వం వహిస్తున్న కూటములూ ఏవైనా ఎఫ్‌డీఐను పూర్తి స్థాయిలో అనుమతించాలన్న విషయంలో అందరిదీ ఒకటే స్వరం. బీమా రంగంలో విదేశీ సంస్థలకు తలుపులు బార్లా తెరవాలని సంపన్న దేశాల నుంచి ఎప్పటినుంచో ఒత్తిళ్లు ఉన్నాయి. మన బీమా రంగంలో ప్రైవేటు సంస్థలున్నా సామాన్య పౌరులు పబ్లిక్ రంగ సంస్థ జీవిత బీమా సంస్థ(ఎల్‌ఐసీ)ను విశ్వసించిన స్థాయిలో వాటిని నమ్మరు. అందుకే మార్కెట్‌లో ఇప్పటికీ దాని భాగస్వామ్యం దాదాపు 65 శాతం. అలాగని చొరవగా దూసుకెళ్లటంలో అదింకా వెనకబడి వున్నదనీ ఆర్థిక రంగ నిపుణులంటారు. పోటీ పెరిగితే ఇది మారుతుందనీ, వినియోగదారులు లాభపడతారనీ వారి వాదన. మన జీవిత బీమా రంగం వాటా జీడీపీలో 3.2 శాతం. వాస్తవానికి ఇది 2023-24 ఆర్థిక సంవత్సరంలో మరింత కిందకు పోయి 2.8 శాతం దగ్గర ఆగింది. విదేశాల్లో ఈ రంగం వాటా 6.5 శాతం. విదేశీ సంస్థలను అనుమతించటాన్ని వ్యతిరేకించేవారు అవి లాభార్జన దృష్టితో ఉంటాయని విమర్శిస్తారు. దేశీయ పొదుపు దేశాభివృద్ధికి కాక విదేశీ సంస్థలకు పోతుందని... పేదరికం ప్రబలంగా ఉన్న మనలాంటి దేశంలో సంక్షోభ కాలంలో ఆసరాగా నిలబడకపోతే ఎలా అన్నది వారి ప్రశ్న. అనుకున్నట్టు లాభాలు రాకపోతే సంస్థలు దివాలా తీసే, నిష్క్రమించే అవకాశం ఉండదా అనే సందేహాలున్నాయి. ఐఆర్‌డీఏఐ వంటి నియంత్రణ సంస్థ ఉండగా ఆ భయాలు అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. ప్రస్తుతం డేటా చౌర్యం కూడా సమస్యే! ప్రైవేటు సంస్థల్లో తగిన నియంత్రణ లేని కారణంగా ఖాతాదారుల డేటా బయటకు పోతోందని, అందువల్ల మోసగాళ్ల బెడద ఎక్కువైందని బీమా రంగాన్ని ప్రైవేటీకరించటాన్ని వ్యతిరేకించే సంస్థలు ఆరోపిస్తున్నాయి. 2047కల్లా పౌరుల్లో ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం చేరాలన్నది ఐఆర్‌డీఏఐ లక్ష్యం. అలాగే ఆరోగ్యం, ఆస్తి తదితరాలకు సైతం బీమా చేయించుకునేలా ప్రచారం చేయాలని ఆ సంస్థ కంకణం కట్టుకుంది. విదేశీ సంస్థల్ని అనుమతించటానికి చాన్నాళ్లుగా మన ప్రభుత్వాలు హైరానా పడుతున్నాయి. తొలిసారి వాజపేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 1999లో ఐఆర్‌డీఏఐ చట్టాన్ని తీసుకొచ్చి ఆ రంగంలో 26 శాతం ఎఫ్‌డీఐలకు తొలిసారి అనుమతించింది. ఆ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్, 2004లో తన నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి రాగానే దాన్ని 49 శాతానికి పెంచే ప్రయత్నం చేసింది. అప్పట్లో యూపీఏకు బాసటగా ఉన్న వామపక్షాలు ఆ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయి. కారణం ఏమైతేనేం ఈ ప్రతిపాదన ముందుకు కదల్లేదు. వారితోపాటు విపక్షంలోఉన్న బీజేపీ సైతం గట్టిగా వ్యతిరేకించింది.

కేంద్రంలో 2014లో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్డీయే అధికారంలోకొచ్చిన వెంటనే పాత ప్రతిపాదన దుమ్ము దులిపింది. ఏడాదికల్లా దాన్ని 49 శాతానికి, మరో ఏడేళ్లకు 74 శాతానికి విస్తరించింది. బీమా సంస్థల్లో విదేశీ భాగస్వాముల వాటా పరిమితమే గనుక భయాందోళనలు అనవసరమని ఇన్నాళ్లూ ప్రభుత్వాలు చెబుతూవచ్చాయి. ఇప్పుడది 100 శాతానికి చేరింది గనుక తగిన జాగ్రత్తలూ, నియంత్రణలూ అవసరం. బిల్లు పార్లమెంటు పరిశీలనకొచ్చినప్పుడు, అందులోని లోటుపాట్లేమిటో, ఇంకా చేయాల్సిందేమిటో చెప్పగలిగే దిశగా ఆరోగ్యవంతమైన చర్చ జరగాలి. దేశీయ పొదుపు కాస్తా అన్యుల చేతుల్లోపడితే, వారు సక్రమంగా నిర్వహించటంలో విఫలమైతే సామాన్యులకు తీరని నష్టం కలుగుతుంది.

పొగబట్టిన కాలుష్యం!

దేశంలో ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యం

శ్వాసకోశ సమస్యల బారిన పడుతున్న ప్రజలు

ఏటా 15 లక్షల మరణాలు సంభవిస్తున్నట్లు చెబుతున్న అధ్యయనాలు

దేశ ప్రజల సగటు ఆయుర్దాయం 3.5 ఏళ్లు తగ్గినట్లు షికాగో వర్సిటీ అధ్యయనంలో వెల్లడి



దేశంలో రోజురోజుకూ వాయు కాలుష్యం పెరిగిపోతోంది. ముఖ్యంగా దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లోని ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. తీవ్ర శ్వాసకోశ సమస్యలతో 2022-24 మధ్య ఢిల్లీలోని ఆరు ప్రభుత్వ ఆసుపత్రులకు 2 లక్షల కంటే ఎక్కువ మంది బాధితులు వచ్చారంటే కాలుష్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్‌లో ప్రచురితమైన 2024 అధ్యయనం ప్రకారం దీర్ఘకాలం కల్‌తమైన గాలిని పీల్చడం వల్ల భారత్‌లో ఏటా 15 లక్షల మంది మరణిస్తున్నారు. వాయు కాలుష్యం వల్ల దేశ సగటు ఆయుర్దాయం 3.5 ఏళ్లు తగ్గిందని షికాగో విశ్వవిద్యాలయం 2025 ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ (ఏక్యూఎల్ఐ) వెల్లడించింది. గాలి నాణ్యతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన పర్టిక్యులేట్ మ్యాటర్-2.5 (పీఎం) ఒక్కో క్యూబిక్ మీటర్‌కు 40 μమైక్రోగ్రాముల వరకు ఆమోదయోగ్యం. అంటే గాలిలో 2.5 మైక్రోమీటర్లు లేదా అంతకంటే తక్కువ వ్యాసంతో కలిసిన దుమ్ము, ధూళి, పొగ కణాలు అన్నమాట. గాలిలో ఈ కణాలు ఎన్ని ఎక్కువగా ఉంటే వాయు కాలుష్యం అంత తీవ్రంగా ఉన్నట్లు లెక్క.

ఏడాది పొడవునా..

దేశంలో వాయు నాణ్యత సంక్షోభం అంతకంతకూ విస్తృతమవుతోంది. ఈ ఏడాది 256 నగరాలు, పట్టణాల్లో పరీక్షలు జరపగా 150 కేంద్రాల్లో వాయు కాలుష్యం నిర్దేశిత ప్రమాణాలను మించిపోయిందని సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ నివేదిక తెలిపింది. చాలా మంది పట్టణవాసులకు అనారోగ్యకర లేదా ప్రమాదకర గాలిని పీల్చడం ఏడాది పొడవునా నిత్యకృత్యంగా మారింది. 2025లో ఢిల్లీలో పీఎం%-%2.5 స్థాయి రోజుకు క్యూబిక్ మీటర్‌కు 107-130 మైక్రోగ్రాములుగాట నమోదైంది. ఇది దేశంలో ఒక రోజు పరిమితి అయిన 60 మైక్రోగ్రాములు, డబ్ల్యూహెచ్ఓ నిర్దేశిత 15 మైక్రోగ్రాముల కంటే చాలా ఎక్కువ.

తగ్గుతున్న ఆయుర్దాయం..

దేశంలో 46% మంది ప్రజలు పీఎం-2.5 స్థాయి కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్నారని ఏక్యూఎల్ఐ నివేదిక తెలిపింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రజలు 4.74 ఏళ్ల ఆయుర్దాయం కోల్పోతున్నారని పేర్కొంది. డబ్ల్యూహెచ్ఓ నిర్దేశించిన కఠినమైన మార్గదర్శకాలను పాటిస్తే ఆయుర్దాయం 9.4 నెలలు పెరుగుతుందని అంచనా వేసింది.

ఎనిమిదిలో ఒకటి..

వాయు కాలుష్యానికి సంబంధించిన మరణాలను భారత్‌లో లెక్కించడం లేదని గ్లోబల్ క్లైమేట్, హెల్త్ అలయన్స్ చెబుతోంది. క్రమబద్ధమైన విధానాలు లేకపోవడమే అందుకు కారణమని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా అకాల మరణాలకు వాయు కాలుష్యం రెండో ప్రధాన కారణమని స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ నివేదిక-2025 తెలిపింది. అన్ని దేశాల్లో కలిపి 2023లో 79 లక్షల మరణాలు వాయు కాలుష్యం వల్ల సంభవించాయని పేర్కొంది. అందులో పీఎం-2.5 స్థాయి కాలుష్యానికి గురై 49 లక్షల మంది మృతిచెందారని తెలిపింది.

తగ్గిన సూర్యకాంతి..

1993-2022 మధ్యకాలంలో గాలిలోని దుమ్ము, ధూళి కారణంగా దేశంలో సూర్యకాంతి దాదాపు 13% తగ్గింది. మేఘాలు అదనంగా 31-44% సూర్యకాంతి క్షీణతకు కారణమయ్యాయని ఐఐటీ కాన్పూర్‌లోని వాతావరణ శాస్త్రవేత్త సచ్చిదానంద్ త్రిపాఠి తెలిపారు. సూర్యకాంతి తగ్గితే వ్యవసాయం, సౌర శక్తితోపాటు రోజువారీ జీవితాలపైనా ప్రభావం చూపుతుందని వివరించారు. ఫొటోవోల్టాయిక్ సిస్టమ్స్‌ను బట్టి సౌర విద్యుత్ ఉత్పత్తి 12-41% పడిపోతుందని చెప్పారు.

బీజింగ్ ఒక ఉదాహరణ..

చైనాలోని బీజింగ్ 20 ఏళ్ల క్రితం ప్రపంచ పొగమంచు రాజధానిగా పేరొందింది. కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా బొగ్గు ఆధారిత బాయిలర్స్‌ను మూసివేయడం, ప్రజారవాణా, పర్యావరణ అనుకూల వాహనాలను ప్రోత్సహించడం, సాంకేతిక సంస్కరణలు, ఆవిష్కరణలు, గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించడం వంటి చర్యలను చైనా సర్కారు యుద్ధప్రాతిపదికన చేపట్టింది. ఫలితంగా పీఎం-2.5 స్థాయి 2013లో ఒక్కో క్యూబిక్ మీటర్‌కు 72గా ఉండగా గతేడాది 29.3 μమైక్రోగ్రాములకు తగ్గిపోవడం విశేషం.

'ఉపాధి'కి కొత్త రూపు!

గ్రామీణ ప్రాంతాల్లో కాయకష్టం చేయగలిగేవారికి ఏడాదికి కనీసం వంద రోజుల పని దినాలు కల్పించేందుకు ఇరవయ్యేళ్ల క్రితం తీసుకొచ్చిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' కనుమరుగు కావటానికి రంగం సిద్ధమైంది. దాని స్థానంలో తీసుకురాదల్చిన 'వికసిత భారత్ రోజ్‌గార్ అజీవికా మిషన్ గ్రామీణ్' (వీబీ-జీ రాం జీ) బిల్లు పార్లమెంటులో రంగప్రవేశం చేసింది. అమలులో ఉన్న పథకం కన్నా ఇది అనేక రెట్లు మేలైనదని కేంద్రం చెబుతోంది. ఆ మాటెలా ఉన్నా ప్రతి పథకమూ హిందీ భాషా పదాల మేళవింపుతో ఉండటం, పదాది అక్షరాలతో గుర్తుండిపోయే పదం వచ్చేలా రూపొందించటం ఎన్డీయే ప్రభుత్వ ప్రత్యేకత. ఈసారైతే గ్రామాల్లో ప్రతి పేద కుటుంబమూ 'జీ రాం జీ' అని స్మరించుకునేలా వాటంగా రూపుదిద్దారు. మహాత్మా గాంధీ పేరు తొలగించారు. పార్టీల మధ్య వాదప్రతివాదాల సంగతెలా ఉన్నా సాధారణ జనం పథకం పేరు కన్నా ప్రయోజనం ఏమేరకన్నదే ప్రధానంగా చూస్తారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వచ్చిన నేపథ్యం ఒకింత విషాదకరమైనది. 'పల్లె కన్నీరు బెదుతుందో...' అంటూ ప్రజాకవి గోరటి వెంకన్న రాసిన పాట అప్పటి పరిస్థితుల్ని ప్రభావవంతంగా చూపింది. వరస కరువులతో, ఆర్థిక సంస్కరణలతో కుదేలై గ్రామీణ భారతం తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న రోజులవి. రైతుల ఆత్మహత్యలు, ఉపాధి కరువై వలసపోవటాలు, చేతివృత్తులు దెబ్బతినటం రివాజయ్యాయి. దేశంలో అనేక జిల్లాలు ఆకలితో అలమటించాయి. అప్పుడు కేంద్రంలో అధికారంలోకొచ్చిన యూపీఏ ప్రభుత్వం 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' తీసుకొచ్చింది. 2006 నుంచి దశలవారీగా అమలు ప్రారంభించింది. పని చూపాలని కోరితే పక్షం రోజుల్లో పని కల్పించటం లేదా నిరుద్యోగ భృతి కల్పించటం, ఉపాధిని దయాధర్మ భిక్షంగా కాక, హక్కుగా గుర్తించటం, కూలీల్లో మూడోవంతు మంది తప్పనిసరిగా మహిళలుండాలనే షరతు, నివాస స్థలానికి అయిదు కిలోమీటర్ల లోపునే పనిచూపటం, అంతకు మించితే అదనపు వేతనం చెల్లించటం దాని ప్రత్యేకతలు. ప్రపంచంలోనే అతి పెద్ద ఉపాధి కల్పనా పథకమది. పల్లెసీమల్లో ఈ పథకం కింద రహదారులు, చెరువుల్లో పూడిక తీయటం, భూసార పరిరక్షణ, నీటిపారుదల సదుపాయాల మెరుగు వగైరా పనులు చేయించటానికి వినియోగించారు. అయితే లోపాలు లేవని కాదు. ఈ పథకం వల్ల తమకు కూలీల లభ్యత తగ్గిందని రైతుల ఫిర్యాదు. అలాగే వేతనాల చెల్లింపులో అలస్యం, నిధుల అరకొర కేటాయింపు, అన్నిచోట్లా ఒకేలా అమలు చేయకపోవటం, బయటి రేట్లతో పోలిస్తే వేతనాలు తక్కువ ఉండటం వగైరాలు సమస్యలు. వీటిని 'జీ రాం జీ' పరిష్కరిస్తుందా? వంద రోజులు కాదు... 125 రోజులు ఉపాధి గ్యారెంటీ అంటున్నది కొత్త పథకం. సాగు పనులు జోరుగా ఉండే రెండు నెలలూ దీన్ని తాత్కాలికంగా నిలిపేస్తారు. ఈశాన్య రాష్ట్రాలూ, కశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ వగైరాలు మినహా మెజారిటీ రాష్ట్రాలు ఈ పథకంలో 40 శాతాన్ని భరించాల్సి రావటం ఇందులోని ప్రధాన సమస్య. ఇంతవరకూ ఇది 10 శాతం మాత్రమే. ఇకపై రాష్ట్రాలు ఏటా కనీసం రూ. 50,000 కోట్లు వెచ్చించాలి. పైగా ప్రతి ఏటా నిర్దిష్ట మొత్తంలో నిధులు కేటాయించటం, అంతకుమించి పెరిగితే రాష్ట్రాలే భరించాల్సి రావటం అదనపు సమస్య. రాష్ట్రాల ఆదాయ వనరులకు గండికొడుతూ అదనంగా ఇంత పెద్ద భారాన్ని మోపటం సరైందేనా? ఎన్డీయేను భుజాలకెత్తుకున్న జేడీ(యూ), టీడీపీ ఏమంటాయి? ఈ పథకం కూడా గతంలో మాదిరే హక్కు ప్రాతిపదికగా ఉంటుందంటున్నా నిధుల లేమితో ఆచరణలో ఆవిరి కాదా? గత అయిదేళ్లలో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు తగ్గుతున్నది. ఏటా ప్రవేశపెట్టే బడ్జెట్ గణాంకాలు ఆ సంగతి చెబుతున్నాయి. రాష్ట్రాలపై అదనపు భారం మోపితే పథకం నీరసిస్తుంది. రాష్ట్రాలకు కేటాయింపుల్లో కేంద్రం అనుసరించబోయే గీటురాళ్లేమిటో ఇంకా తెలియాల్సి ఉంది. తమకేం అవసరమో రాష్ట్రాలు నిర్ణయించు కోవటానికి బదులు ఎక్కడెక్కడ ఖర్చు చేయాలో కేంద్రం నిర్దేశిస్తుంది. వికేంద్రీకరణ అవసరం నానాటికీ పెరుగుతుండగా అందుకు భిన్నమైన మార్గం సమర్థనీయం కాదు. మొత్తానికి దీనివల్ల ఒరిగేదేమిటో, కష్టనష్టాలేమిటో ముమ్ముందు తెలుస్తాయి.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

చిత్తూరు జిల్లా కో-ఆపరేటివ్ బంగారుపాళ్యం బ్రాంచ్ నందు శ్రావణం మాసం సందర్భంగా ప్రత్యేక డిపాజిట్ పథకం సద్వినియోగం చేసుకోండి.

మేనేజర్ రాజు శ్రీ వాత్సవ.

చిత్తూరు జిల్లా బంగారుపాలెం అగస్టు 31: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ బంగారు పాలెం బ్రాంచ్ నందు శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజర్ రాజు శ్రీ వాత్సవ మాట్లాడుతూ,21-08-2026 వ తేదీ నుండి 30-09-2026 వ తేదీ వరకు ఈ పథకం అందుబాటులో ఉంటుందని తెలిపారు. డిపాజిట్ కాలపరిమితి 456 రోజుల సాధారణ ప్రజలకు వడ్డీ రేటు 7.60%, సీనియర్ సిటిజనులకు 8.20% వడ్డీ రేటు, సూపర్ సిటిజెన్లకు 8.30% ప్రత్యేక వడ్డీ రేటు ఉంటుందని తెలిపారు. ఈ పథకం వల్ల పొదుపు మరింత భద్రంగా, ఆకర్షణీయమైన వడ్డీ రాబడితో, మీ భవిష్యత్తుకు ఆర్థిక భరోసా ఉంటుందని కావున ఈ ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ రాజు శ్రీ వాత్సవ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజశేఖర్ బ్యాంకు సిబ్బంది మరియు ప్యాక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గణిత శాస్త్రం, కంప్యూటేషనల్ స్టడీస్‌పై అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ

రుపతి,ఆగస్టు 31,మహి న్యూస్: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం మదన మోహన మాళవీయ శిక్షక ప్రశిక్షణ కేంద్రం మరియు గణితశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన “గణిత శాస్త్రం మరియు కంప్యూటేషనల్ స్టడీస్‌లోని నూతన ధోరణులు” అనే అంశంపై ఆరు రోజుల అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి 46 మంది అధ్యాపకులు ఈ శిక్షణా కార్యక్రమంలో నమోదు చేసుకుని క్రియాశీలకంగా పాల్గొన్నారు.

ముగింపు వేడుకలు

ఈ కార్యక్రమ ముగింపు సమావేశంలో గుజరాత్ నుండి విచ్చేసిన ముఖ్య అతిథి ఆచార్య రాకేష్ మణిలాల్ పటేల్, విద్యా విషయక డీన్ ఆచార్య రాజనీకాంత్ శుక్లా, కేంద్ర సంచాలకులు ఆచార్య ఎస్. మురళీధర రావు, గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఏ. చందూలాల్, అదనపు సంచాలకులు డాక్టర్ ఎ. చారుకేశ్, డాక్టర్ కె. శంకర్, వివిధ విషయ నిపుణులు మరియు పాల్గొన్న అధ్యాపకులు పాల్గొన్నారు.

బోధనా వృద్ధికి ఉపయోగపడే నూతన ధోరణులు

గణిత శాస్త్రం, కంప్యూటేషనల్ రంగాలు మరియు ఆధునిక సాంకేతిక వర్గాల్లో వస్తున్న పరిశోధనా మార్పులు, అధునాతన బోధనా పద్ధతులపై ఈ శిక్షణ ద్వారా ప్రతినిధులు సంపూర్ణ అవగాహన సాధించారు. ముఖ్య వక్తలు మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానం అధ్యాపకుల బోధన, పరిశోధన మరియు వృత్తిపరమైన అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 255 అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి, మహి న్యూస్, ఆగస్టు 31: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను జిల్లా కలెక్టర్ సావధానంగా వింటూ అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీల ఏర్పాటు, త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్ తదితర సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలని, అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని అధికారులను ఆదేశించారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సిబ్బంది రసీదులను అందించారు.

శాఖల వారీగా అర్జీల వివరాలు:

రెవెన్యూ -- 144, పంచాయతీరాజ్ -- 36, హోం -- 10, ఎస్ఎస్ఎల్ఆర్ -- 10, పాఠశాల విద్య -- 7, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -- 6, ఫ్యామిలీ వెల్ఫేర్ -- 5, రూరల్ డెవలప్‌మెంట్ -- 4, సెర్ప్ -- 3, ఏపీఎస్‌పీడీసీఎల్ -- 3, దేవాదాయ శాఖ -- 3, కాలుష్య నియంత్రణ మండలి -- 2, గనులు మరియు భూగర్భశాస్త్రం -- 2, ఎన్‌హెచ్ -- 2, బీసీ కార్పొరేషన్ -- 2, ఎన్ఎస్ఏ -- 2, ఇంటర్మీడియట్ విద్య -- 2, ఐసీడీఎస్ -- 1, టుడా -- 1, హౌసింగ్ -- 1, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ -- 1, ఎస్సీ కార్పొరేషన్ -- 1, సెకండరీ హెల్త్ -- 1, ఇరిగేషన్ -- 1, అగ్రికల్చర్ -- 1, పీఆర్ ఇంజినీరింగ్ -- 1, హ్యాండ్‌లూమ్స్ -- 1, తెలుగు గంగ ప్రాజెక్టు -- 1, ఆర్ అండ్ బి -- 1 వెరసి మొత్తం 255 అర్జీలు రావడం జరిగిందని, సంబంధిత అధికారులు వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా, నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు.

పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీలను అత్యంత నాణ్యతతో, నిర్దేశిత సమయంలో పరిష్కరించాలి

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 31: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను అత్యంత నాణ్యతతో, నిర్దేశిత సమయంలోగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలోని కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ -- పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా డీఆర్వో కె. మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, సంబంధిత ఆర్డీవోలతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 230 వినతులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా 163 వినతులు రెవెన్యూ, సర్వే శాఖకు సంబంధించినవే కావడం గమనార్హం. ప్రజలకు న్యాయం జరిగేలా ప్రతి వినతిని నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను ప్రాధాన్యతతో పరిశీలించి వెంటనే డిస్పోజ్ చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా వినతులపై స్పందన వేగవంతమైతేనే ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడుతుందని, అధికారులు పీజీఆర్ఎస్ పోర్టల్‌ను నిరంతరం పరిశీలిస్తూ పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

శాఖల వారీగా వచ్చిన వినతులు:

రెవెన్యూ, సర్వే శాఖకు 163, పోలీస్ శాఖకు 4, పంచాయతీ రాజ్ శాఖ 3, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ 2, డీఆర్‌డీఏకు 21, ఇరిగేషన్ శాఖ 7, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్ 5, రూరల్ డెవలప్మెంట్ 2, దేవదాయ శాఖ 1, పరిశ్రమల శాఖ 2, పౌరసరఫరాల శాఖ 2, పశుసంవర్ధక శాఖ 2, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ 2, జిల్లా గ్రంథాలయం 1, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 2, వాటర్ రిసోర్సెస్ 3, గృహ నిర్మాణ సంస్థ 1, విద్యుత్ శాఖ 2, ఎల్ డి ఎం 2, డిసిసి బ్యాంక్ 1, ఐసిడిఎస్ 1, బీసీ కార్పొరేషన్ 1 సొప్పున మొత్తం 230 వినతులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను వినతల రూపంలో అందజేశారు ఈ కార్యక్రమంలో నగిరి ఆర్డీవో అనుపమ,డీపీఎం, మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్ వెంకట సునీల్, జిల్లాలోని వివిధ శాఖల ఉన్నత శాఖల తదితరులు అధికారులు పాల్గొన్నారు.

యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడాలి

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి చిత్తూరు జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చాలి

చిత్తూరు, మహి న్యూస్, ఆగస్టు 31: దేశ భవిష్యత్తుకు అవసరమైన యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం మాదకద్రవ్యాలు మరియు గంజాయి నియంత్రణ చర్యలు -- అవగాహన కార్యక్రమాలు ఎన్సిఓర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్, చీజూ=ణ) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీఓలు, పోలీను అధికారులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఈగల్ టీమ్ తదితర అధికారులతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖలు మరింత సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాల మధ్య రవాణాకు రైల్వే, ఆర్టీసీ ప్రధాన మార్గాలుగా ఉన్నందున, ఈ మార్గాల్లో తనిఖీలు, నిఘాను మరింత పటిష్టం చేయాలని తెలిపారు. ఆర్టీసీ అధికారులు తమ పరిధిలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు, రాండమ్ చెకింగ్ విధానం, డ్రైవర్లు, కండక్టర్లకు ఇస్తున్న శిక్షణ, పోలీసుల సహకారంతో నిర్వహిస్తున్న తనిఖీలు తదితర అంశాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి అన్ని డిపో మేనేజర్లు, డీఎం, ఆర్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి నుంచి లిఖితపూర్వక నివేదికలు తీసుకోవాలని ఈగల్ టీమ్‌ను ఆదేశించారు. డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై ముందస్తు నిఘా పెంచాలని, అవసరమైన సందర్భాల్లో సంబంధిత వ్యక్తులకు అవగాహన కల్పించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఎక్సైజ్ శాఖ, ఆర్టీఓలు, డీఎస్పీలు, పోలీసు శాఖ, ఈగల్ సెల్ అధికారులు తమ పరిధిలో చేపడుతున్న చర్యలపై లిఖితపూర్వక నివేదికలు సమర్పించాలని తెలిపారు. యువతను మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకుండా చేయడానికి పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, మెడికల్ కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఆర్డీఓలు, డీఎస్పీల అధ్వర్యంలో క్లస్టర్ స్థాయిలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని, డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన నష్టాలను విద్యార్థులకు వివరించాలని తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వామ్యం చేసి, ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. జిల్లాలో డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చర్యలను నిరంతరం కొనసాగించాలని స్పష్టం చేశారు. డ్రగ్స్ లేదా గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే పోలీసు శాఖకు లేదా ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972, 9490617896కు సమాచారం అందించాలని, సమాచారమిచ్చే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ మారూరి పుల్లారెడ్డికి డా. రామకృష్ణ స్మారక జీవన సాఫల్య పురస్కారం ప్రదానం

పల్నాడు జిల్లా/సత్తెనపల్లి /మహి న్యూస్ అగస్టు 31: కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ ఒంగోలు వారి అధ్వర్యంలో శనివారం ఒంగోలులోని సివియన్ రీడింగ్ రూం అవరణలో గిడుగు రామమూర్తి పంతులు163 వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారులచే 'తెలుగు పాటల పూదోట ఈపూట' పేరిట అచ్చంగా తెలుగు భాషకు సంబంధించిన పాటలతో నృత్య నీరాజనం కార్యక్రమం అద్భుతంగా జరిగింది. అనంతరం ప్రముఖ సాహితీవేత్త, వ్యాఖ్యాత, ప్రభుత్వ పాఠ్య పుస్తకాల రచయిత 'కీ.శే డా. వంకాయలపాటి రామకృష్ణ (సత్తెనపల్లి) స్మారక జీవన సాఫల్య పురస్కార అవార్డును సత్తెనపల్లికి చెందిన సీనియర్ పాత్రికేయులు, గుంటూరు జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ మాజీ అధ్యక్షులు మారూరి పుల్లారెడ్డికి స్వర్గీయ రామకృష్ణ భార్య శ్రీమతి వంకాయలపాటి జయలక్ష్మి అందజేశారు. ఈసందర్భంగా చందు డాన్స్ అకాడమీ చిన్నారులు అవార్డు గ్రహీతకు నృత్యాభినయంతో పూలు చల్లుతూ సాంప్రదాయ పద్ధతి ప్రకారం సత్కరించారు. సంస్థ సభ్యులు సన్మాన పత్రం సమర్పించారు. పురస్కార గ్రహీత పుల్లారెడ్డి మాట్లాడుతూ కీర్తిశేషులు డా. వంకాయలపాటి రామకృష్ణ తో తనకున్న సాన్నిహిత్యాన్ని, అయన విశిష్టతను గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి సంస్థ అధ్యక్షులు డా. నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ మన మాతృ భాషను పరిరక్షించుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ఇలాంటి కార్యక్రమాల నిర్వహణకు సహరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు శ్రీమతి తేళ్ళ అరుణ మాట్లాడుతూ వాడుక భాషోద్యమానికి సారధ్యం వహించి,వాడుక భాషలోనే ప్రజల వ్యవహారాలన్నీ జరగాలని,దాన్ని లక్ష్యంగా చేసుకుని, దానికోసం గ్రాంథిక భాషావాదులతో తగవులు పడి చివరకు విజయాన్ని సాధించిన వైతాళికుడు గిడుగు అని అన్నారు.

విశ్రాంత అడిషనల్ ఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధి కోసం అందరూ కలిసి కట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నేటి యువతరం అందుకు ముందుకు వచ్చేలా విద్యార్థులకు పద్య పఠన పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని సూచించారు. తదుపరి విశిష్ట అతిథిగా పాల్గొన్న శ్రీ కృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, ప్రముఖ కవి యు.వి.రత్నం, పరాంకుశం కృష్ణవేణి, మిడసల మల్లికార్జునరావు, గుంటూరు సత్యనారాయణ, కేయస్వీ ప్రసాద్, ఓరుగంటి ప్రసాద్, కోవెలకుంట్ల బాలకోటయ్య తదితరులు పాల్గొని తెలుగు భాష తియ్యదనాన్ని గురించి డా. రామకృష్ణ గొప్పతనాన్ని గురించి ప్రసంగించారు. ముందుగా గిడుగు రామమూర్తి, తెలుగుతల్లి చిత్ర పటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ గుండవరపు అమర్ నాథ్, ప్రజాశక్తి విలేకరి రాము, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీకి అభివృద్ధి కోసం చేయూతను అందించండి

